## ఆ విషయాల గురించి పట్టించుకోను

తన వ్యక్తిగత జీవితం గురించి సోషల్ మీడియాలో, బయట వచ్చే వార్తలను ఏమాత్రం పట్టించుకోనని, వృత్తిపరంగా పర్‌ఫెక్షన్ కనబరచడంపైనే తాను ఎక్కువ శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు యువ హీరో నాగచైతన్య. ఆయన నటించిన 'దూత' వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు నాగచైతన్య. ముఖ్యంగా సమంతతో విడాకుల అనంతరం తన వ్యక్తిగత జీవితం సోషల్‌మీడియాలో చర్చనీయాంశం కావడం గురించి మాట్లాడారు. 'ఇలాంటి విషయాల గురించి నేను పెద్దగా ఆలోచించను. ప్రేక్షకులకు నా వృత్తి గురించే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. వారిని ఎంటర్‌టైన్ చేసే మంచి కథల్ని ఎంచుకొని సినిమాలు చేయాలన్నదే నా లక్ష్యం. అంతిమంగా ప్రేక్షకులు వ్యక్తిగత విషయాల కంటే సినిమాపరమైన విజయాలనే ఎక్కువగా గుర్తుంచుకుంటారు' అని నాగచైతన్య అన్నారు. ప్రస్తుతం నాగచైతన్య చందు మొండేటి దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం 'తండేల్'లో నటిస్తున్నారు.




నాగచైతన్య

## నీకోసం ఎర్రైనా అవుతా.. సొర్రైనా అవుతా!



'నీకోసం ఎర్రైనా అవుతా.. సొర్రైనా అవుతా.. నీ ఒక్కడికోసం.. నువ్వెప్పుడు పిలిచినా నేనిక్కడికొస్తా..' ప్రభాస్ 'సలార్'లోని డైలాగ్ ఇది. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. అందులో ప్రథమంగా వినిపించేది ఈ డైలాగే. ఈ ఒక్క డైలాగ్‌తో దాదాపు కథంతా చెప్పేశాడు ప్రశాంత్‌నీల్. ఇది ఇద్దరు మిత్రుల కథ అని ట్రైలర్ చూస్తే అర్థమైపోతుంది. ఆ స్నేహితులుగా ప్రభాస్, మలయాళం హీరో పృథ్వీరాజ్ నటించారు. వందలఏళ్ల క్రితం మొదలైన కథగా 'సలార్'ని వాయిస్‌ఓవర్ ద్వారా పరిచయం చేశాడు దర్శకుడు ప్రశాంత్‌నీల్. వందలయేళ్ల క్రితం మహ్మద్ గజనీ, ఛంఘిజ్‌ఖాన్ కంటే క్రూరమైన బందిపోట్లు ఉండేవాళ్లు. వాళ్లు శతాబ్దాలపాటు ఎదురులేకుండా పాలించిన ప్రాంతమే 'కాన్సార్'. కాలక్రమంలో అదో సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. ఇప్పుడు అక్కడ కూడా కుర్చీకోసం కుతంత్రాలు మొదలయ్యాయి. ఆ సామ్రాజ్యానికి అధిపతి కావాల్సిన వరదరాజ్ మన్నార్‌ని తప్పించి, సింహాసనాన్ని చేజిక్కించుకోవాలని కొందరు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వేలాదిగా ముష్కరులు కన్సార్‌లోకి అడుగుపెట్టారు. ఇప్పుడు వరదరాజ్ మన్నార్ ఒంటరి. అతన్ని కాపాడే సైన్యం ఎవరు?. ఆ ప్రశ్న ఉత్పన్నవ్వగానే, అతని నోటివెంటే వినిపించే పేరు 'దేవ'. దేవాగా ప్రభాస్ ఎంట్రీ ట్రైలర్‌లో గూజ్‌బంప్స్ తెప్పించిందనే చెప్పాలి. కన్సార్‌లోకి తనొచ్చాడు. సమస్యను చక్కదిద్ది వెళ్లిపోయాడు. దాదాపు సినిమా కథంతా ఉందీ ట్రైలర్‌లో. 3నిమిషాల 46 సెకన్స్ ట్రైలర్‌లో, రెండు నిమిషాల 18 సెకన్ల కంటెంట్ పూర్తయ్యే వరకూ హీరో ఎంట్రీ జరగదు. లేట్‌గా కనిపించినా ఎంట్రీ మాత్రం అదిరిపోయిందనే చెప్పాలి. 'పెద్దపెద్ద గోడలు కట్టేదే భయపడి.. బయటికెవడు పోతాడని కాదు.. లోపలికెవడొస్తాడని..' డైలాగ్ సూపర్. స్నేహితుడికోసం 'ఎర్రైనా అవుతా.. సొర్రైనా అవుతా' అని చెప్పిన స్నేహితుడి కథే ఈ 'సలార్'. ఈ నెల 21న విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఇప్పుడీ ట్రైలర్ వాటిని రెట్టింపుచేసిందని చెప్పక తప్పదు.

## ఐటమ్‌సాంగ్ చిత్రీకరణ వాయిదా?



కొన్ని సంవత్సరాలుగా 'పుష్ప' సినిమా కోసమే పనిచేస్తున్నాడు అల్లు అర్జున్. తొలి భాగం విడుదలై అఖండ విజయాన్ని అందుకోగానే, 'పుష్ప-2' షూటింగ్‌లో బిజీ అయిపోయాడాయన. వందలకోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఐటమ్ సాంగ్‌ని ఈ వారంలోనే చిత్రీకరించడానికి దర్శకుడు సుకుమార్ ప్లాన్ చేశారు. అయితే ఆ పాట షూటింగ్ పోస్ట్‌పోన్ అయింది. అల్లు అర్జున్ అనుకోకుండా అనారోగ్యం పాలవ్వడమే ఈ పోస్ట్‌పోన్‌కి కారణమని తెలుస్తున్నది. నిజానికి ఈ సినిమాకోసం నిరంతరాయంగా శ్రమిస్తున్నాడు బన్నీ. ఈ వారంలో జరిగే పాట చిత్రీకరణ విషయంలోనూ ఆయన అన్ని రకాలుగా సిద్ధమయ్యారట. రిహార్సల్స్‌లో కూడా పాల్గొన్నారట. అయితే ఉన్నట్టుండి ఆయన సిక్ అవ్వడంతో షూటింగ్‌ని ఈ నెల రెండోవారానికి మేకర్స్ పోస్ట్ పోన్ చేశారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఆగస్ట్ 15న విడుదల కానున్న విషయం తెలిసిందే.



## 'బచ్చల మల్లి'గా అల్లరి నరేశ్

అల్లరి నరేశ్ కొత్త సినిమా 'బచ్చల మల్లి' షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో లాంఛనంగా మొదలైంది. ఇది హీరోగా ఆయన 63వ సినిమా కావడం విశేషం. సుబ్బు మంగాదేవి దర్శకుడు. 'సామజవరగమన'ఫేం రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రానికి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి ప్రతాపరెడ్డి కెమెరా స్విఛాన్ చేయగా, అనిల్ రావిపూడి క్లాప్ ఇచ్చారు. విజయ్ కనకమేడల తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ని దర్శకులు మారుతి, బుచ్చిబాబు మేకర్స్‌కి అందించారు. సినిమా బాగా రావాలని, మంచి విజయం సాధించాలని అతిథులందరూ ఆకాంక్షించారు. ఈ సందర్భంలోనే టైటిల్‌నీ, టైటిల్ పోస్టర్‌ని కూడా ఆవిష్కరించారు. న్యూఏజ్ యాక్షన్ డ్రామాగా, 1990 నేపథ్యంలో సాగే యునిక్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతున్నదని, శక్తిమంతమైన పాత్రను ఇందులో అల్లరినరేశ్ పోషిస్తున్నారని దర్శకుడు చెప్పారు. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, కోట జయరామ్, రావు రమేశ్, సాయికుమార్, ధనరాజ్, హరితేజ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.

## భయంగా ఉంది.. ధైర్యాన్నిస్తారా!?



'ఆసక్తి రేకెత్తిస్తున్న సదరన్ ఇండస్ట్రీ సినిమాల్లో విక్రమ్ 'తంగలాన్' ఒకటి. ఈ సినిమాలో నా పాత్ర ఊహలకు అందని రీతిలో ఉంటుంది. నా కెరీర్‌కి మలుపునిచ్చే సినిమా 'తంగలాన్'' అంటున్నది కథానాయిక మాళవిక మోహనన్. పా రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'తంగలాన్' చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్) లో పనిచేసే కార్మికుల జీవితాల చుట్టూ తిరిగే కథాంశంతో దర్శకుడు పా రంజిత్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో విక్రమ్ ఓ తండాకు చెందిన వ్యక్తిగా కనిపించనున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మాళవిక మోహనన్ తన పాత్రకు డబ్బింగ్ చెపుతున్నది. ఈ సందర్భంగా తను పైవిధంగా స్పందించింది. దీంతోపాటు మాళవిక పెట్టిన మరో పోస్ట్ కూడా నెటిజన్స్‌ని బాగా ఆకట్టుకుంటున్నది. 'నటించడమంటే తేలిగ్గా చేసేస్తాను కానీ, డబ్బింగ్ అంటేనే భయం. నన్నడిగితే సినిమా మేకింగ్‌లో డబ్బింగ్ అంత కష్టమైన పని వేరొకటి లేదు. కాస్త భయంగా ఉంది. ఎవరైనా వచ్చి నా చేయి పట్టుకుని ధైర్యాన్నిస్తారా?' అంటూ తన వ్యక్తిగత సాంఘిక మాధ్యమంలో కామెంట్ పెట్టింది మాళవిక మోహనన్. ఈ కామెంట్‌కి నెటిజన్స్ కూడా గమ్మత్తుగా స్పందిస్తున్నారు.

మాళవిక మోహనన్



## నలుగురు స్నేహితుల కథ

ఇటీవలే 'జవాన్' చిత్రంతో కెరీర్‌లోనే భారీ విజయాన్ని అందుకున్నారు బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్‌ఖాన్. దాంతో ఆయన తాజా చిత్రం 'డంకీ'పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. తాజాగా ఈ చిత్రంలోని 'నికలె ది కబీ హమ్ ఘర్ సే' పాటను శుక్రవారం విడుదల చేశారు. విదేశాలకు వెళ్లాలని తాపత్రయ పడే నలుగురు స్నేహితుల భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ ఈ పాట హృద్యంగా సాగింది. మాతృదేశంపై వారికున్న మమకారానికి అద్దం పట్టింది. 'యథార్థ ఘటనలను ఆధారంగా చేసుకొని దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. నలుగురి స్నేహితుల జీవిత ప్రయాణాన్ని ఈ సినిమాలో చూపించాం' అని చిత్రబృందం పేర్కొంది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాజ్‌కుమార్ హిరాణీ, గౌరీ ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించారు..

## వధువుగా థ్రిల్ చేస్తా..



'ఇటీవల 'మాన్షన్ 24' అనే వెబ్‌సిరీస్ చేశాను. ఆ షూటింగ్‌లోనే నాకు 'వధువు' కథ చెప్పారు. సక్సెస్‌ఫుల్ బెంగాలీ వెబ్‌సిరీస్ 'ఇందు'ని తెలుగులో వధువుగా తీస్తున్నారు. ఈ ప్రపోజల్ నాదగ్గరకొచ్చినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. ఎందుకంటే ఇలాంటి స్క్రిప్ట్ నా కెరీర్‌లో ఇప్పటివరకూ చేయలేదు' అని అవికాగోర్ అన్నారు. ఆమె టైటిల్‌రోల్ పోషిస్తున్న వెబ్ సిరీస్ 'వధువు'. నందు, అలీ రెజా కీలక పాత్రధారులు. పోలూరు కృష్ణ దర్శకుడు. శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మాతలు. ఈ నెల 8న నుంచి ఈ వెబ్‌సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సిరీస్ అనుభవాలను అవికా గోర్ విలేకరులతో పంచుకున్నారు. 'ఇందులో అందరూ అనుకున్నట్టు హారర్ ఎలిమెంట్స్ ఉండవు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, మిస్టరీ సన్నివేశాలు ఉంటాయి. ఇప్పటివరకూ టీవీ కంటెంట్‌ని ఇష్టపడేవారు 'వధువు'తో ఓటీటీకి వస్తారు' అని అవికా నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కథలో చాలా ప్రశ్నలు ఉంటాయని, అవన్నీ ఆసక్తిని కలిగిస్తాయని, చిన్నారి పెళ్లికూతురు' టైమ్‌లో చిన్నపిల్లని కావడంవల్ల పెళ్లి అంటే ఏంటో కూడా తెలిసేదికాదు, డైరెక్టర్‌ని అడిగి తెలుసుకొని చేసేదాన్నని, ఇప్పుడు పూర్తి అవగాహనతో నటిస్తున్నానని, ఇదంతా తన పాత్రల ద్వారా తెలుసుకున్న విజ్ఞానమేనని అవిక అన్నారు.



## ఒకే సన్నివేశం రెండు రాత్రులు తీశాడు..

విభిన్నమైన నటప్రయాణం సాగిస్తున్నది కథానాయిక రాధిక ఆప్టే. సాటి హీరోయిన్లతో పోలిస్తే ఆమెది పెక్యులర్ కెరీర్. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, టీవీషోలు.. ఇలా వేదిక ఏదైనా సరే, నచ్చితే చేసేయడం రాధిక ప్రత్యేకత. రీసెంట్‌గా కత్రినాకైఫ్ కథానాయికగా నటిస్తున్న ఓ చిత్రంలో అతిథిపాత్రలో నటించింది రాధిక ఆప్టే. పూర్తి వివరాల్లోకెళ్తే- విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ ప్రధాన పాత్రధారులుగా శ్రీరాం రాఘవన్ దర్శకత్వంలో 'మేరీ క్రిస్మస్' అనే సినిమా రూపొందుతున్నది. అందులోనే రాధిక అతిథిగా నటించింది. అతిథి అంటే సినిమాలో ఓ అయిదారు సన్నివేశాలు ఉంటాయి అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే. కేవలం ఒకేఒక్క సన్నివేశంలో ఆమె కనిపిస్తుంది. ఈ పాత్ర గురించి రాధికా ఆప్టే మాట్లాడుతూ 'ఇంత చిన్న పాత్ర ఒప్పుకోడానికి కారణం కేవలం దర్శకుడు. తను నాకు మంచి ఫ్రెండ్. అంతే కాదు. తను తీసిన ప్రతి సినిమాలోనూ నేనున్నా. ఆ సెంటిమెంట్‌ని మిస్ చేయకూడదనే నటించా. చేసింది ఒక్క సన్నివేశమే అయినా.. షూటింగ్ మాత్రం రెండు రాత్రుళ్లు పాల్గొనాల్సి వచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది రాధిక ఆప్టే.



## రీమేక్ సినిమాలు నచ్చవు

'అర్జున్‌రెడ్డి' చిత్రం ద్వారా తెలుగులో అరంగేట్రం చేసింది షాలిని పాండే. అందం, అమాయకత్వం కలబోసిన ప్రీతి పాత్రలో ఆమె అభినయానికి యువతరం ముగ్ధులయ్యారు. టాలీవుడ్‌లో ఘనమైన ఎంట్రీ ఇచ్చినప్పటికీ ఆ తర్వాత ఆశించిన అవకాశాలు, విజయాలు దక్కలేదు. ప్రస్తుతం ఈ భామ హిందీ చిత్రసీమలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'అర్జున్ రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్‌సింగ్'లో తాను నాయికగా నటించలేకపోవడానికి కారణాల్ని వివరించింది. ఆమె మాట్లాడుతూ 'తెలుగులో నేను పోషించిన ప్రీతి పాత్ర అందరికి గుర్తుండిపోయింది. రీమేక్ గురించి నన్నెవరూ సంప్రదించలేదు. ఒకవేళ ఆఫర్ వచ్చినా తిరస్కరించేదాన్ని కావొచ్చు. ఎందుకంటే స్వతహాగా నాకు రీమేక్స్‌లో నటించడం ఇష్టం ఉండదు. ఒకే పాత్రను భిన్న భాషల్లో చేయడం వల్ల పాత్రపరంగా వైవిధ్యాన్ని ప్రదర్శించే అవకాశం దొరకదు. అయితే 'కబీర్‌సింగ్'లో షాహిద్‌కపూర్, కియారా అద్వాణీల మధ్య కెమిస్ట్రీ మాత్రం అద్భుతంగా అనిపించింది' అని చెప్పుకొచ్చింది. గత ఏడాది 'జయేష్‌బాయ్ జోర్దార్' చిత్రంతో హిందీలో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ప్రస్తుతం వెబ్ సిరీస్‌లలో నటిస్తూ బిజీగా ఉంది.



## పవర్‌స్టార్‌తో సినిమా చేస్తా..

దర్శకుడు మెహర్‌రమేశ్‌లోని ఆత్మవిశ్వాసాన్ని నిజంగా మెచ్చుకోవాల్సిందే. జయాపజయాలను ఆయన పట్టించుకోడు. తన పని తాను చేసుకుంటూ వెళతాడు. ఒక్కోసారి ఫలితం గొప్పగా లేకపోయినా ఆత్మవిశ్వాసాన్ని మాత్రం వదులుకోడు. అగ్రకథానాయకుడు చిరంజీవి హీరోగా మెహర్‌రమేశ్ దర్శకత్వంలో వచ్చిన 'భోళాశంకర్' చిత్రం ఆశించినంత గొప్పగా ఆడకపోయినా ఆ ఫలితం ప్రభావం తనపై పడకుండా తన నెక్ట్స్ సినిమాల కోసం కథలు తయారుచేసుకునే పనిలో బిజీ అయిపోయాడు మెహర్‌రమేశ్. ఇందులో భాగంగానే ఇటీవలే తన కథల గురించి ఓ అప్‌డేట్ ఇచ్చాడు. 'పవన్‌కల్యాణ్‌కోసం ఓ కథ తయారు చేసుకున్నాను. అవకాశం చూసుకొని ఆయనకు వినిపించే ప్రయత్నం చేస్తాను. ఆయనతో సినిమా చేయాలని గట్టిగా ఫిక్స్ అయ్యాను' అని చెప్పాడు మెహర్‌రమేశ్. సక్సెస్ వెనకాల పరిగెత్తే ఫిలిం ఇండస్ట్రీలో ఆత్మవిశ్వాసమే ఆయుధంగా చేసుకొని ముందుకెళ్తున్న మెహర్‌రమేశ్‌ని నిజంగా అభినందించాలి.

## తప్పుగా అర్థం చేసుకున్నారు!



గోవాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' (ఇఫి) వేడుకలో 'కాంతార' చిత్రానికి సిల్వర్ పీకాక్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, హీరో రిషబ్‌శెట్టి ఇచ్చిన ప్రసంగం చర్చనీయాంశంగా మారింది. ''కాంతార' చిత్రానికి తొలుత కన్నడ ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఆ తర్వాత జాతీయ స్థాయిలో ఆదరణ దక్కింది. సినిమా ఈ స్థాయిలో విజయం సాధించడానికి కన్నడ ప్రేక్షకులే కారణం. నేను వారికి రుణపడి ఉంటాను. ఒక సినిమా సూపర్‌హిట్ కాగానే కన్నడ ఇండస్ట్రీ వదిలి వేరే భాషల్లోకి వెళ్లను. నేను అలాంటి వ్యక్తిని కాను' అంటూ రిషబ్ శెట్టి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అగ్ర కథానాయిక రష్మిక మందన్నను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టారు. రష్మిక తన తొలి చిత్రం 'కిరిక్ పార్టీ' తర్వాత కన్నడ ఇండస్ట్రీని వదిలి తెలుగు, హిందీపై దృష్టి పెట్టిందని, రిషబ్ చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ఆమెను ఉద్దేశించినవేనని నెటిజన్లు కామెంట్స్ చేశారు. అయితే ఓ అభిమాని మాత్రం రిషబ్‌శెట్టి ఎవరినీ ఉద్దేశించి ఆ మాటలు అనలేదని, కన్నడ పరిశ్రమను వదిలివెళ్లనని మాత్రమే చెప్పారని కామెంట్ చేశాడు. దీనికి రిషబ్‌శెట్టి స్పందిస్తూ 'చాలా మంది నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. నువ్వొక్కడివే నిజాన్ని తెలుసుకున్నావు' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఇది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రిషబ్‌శెట్టి ప్రస్తుతం 'కాంతార' చిత్రానికి ప్రీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు.